క్లుప్తంగా

నేడు, రేపు పుష్కరాలకు బస్సులు

గుడివాడ టౌన్: భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరం, సరస్వతి నది పుష్కరాలకు గుడివాడ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ డీ రాజేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్ర, శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర రూ. 2 వేలుగా నిర్ణయించామని చెప్పారు. వివరాలకు 94947 59318, 95500 62465 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

ముగిసిన హనుమాన్ చాలీసా పఠనం



కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు గ్రామంలో గత 45 రోజుల నుంచి కొనసాగుతున్న హనుమాన్ చాలీసా పఠనం గురువారం ముగిసింది. గ్రామంలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలోని హనుమాన్ ఉపాలయంలో మహిళలు 108 సార్లు హనుమాన్ చాలీసా పఠించారు. అలాగే హనుమాన్ జయంతి సందర్భంగా సుందరాకాండ కూడా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కోసూరు ఆదినారాయణరావు పర్యవేక్షించగా దేవాలయ అర్చకుడు చక్రవర్తుల వెంకట ఆదిశేషవరప్రసాద్ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

యజ్ఞ యాగాదులతో సత్ఫలితాలు



పామర్రు: లోక కల్యాణార్థం నిర్వహించే యజ్ఞ యాగాది క్రతువులు సత్ఫలితాలు ఇస్తాయని ప్రముఖ వేద పండితుడు చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు పేర్కొన్నారు. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయ పక్కన నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం హోమాలు, యజ్ఞాలు నిర్వహించారు. తదుపరి మంత్ర జల కలశాలను భక్తులు గ్రామంలో ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపకుడు తాడిశెట్టి సాంబశివరావు, పద్మజ, సత్యనారాయణ ఉషారాణి, మధుశేఖర్ దివ్యభారతి, తాడిశెట్టిసతీష్ పావని తదితరులు పూజలు నిర్వహించారు.

బస్టాండ్ సెంటర్‌లో ఆక్రమణలు తొలగించాలి

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు గ్రామపంచాయతీకి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై గ్రామస్తుల తరఫున చింతా శ్రీనివాస్ (రాజా) పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. గ్రామస్తుల ప్రయోజనార్థం గతంలో జమిందారులు కొంత స్థలాన్ని విడిచిపెట్టారని, దానిలో గ్రామస్తులు అనేక సామాజిక, భక్తి, సేవా కార్యక్రమాలు నిర్వహించుకునేవారని శ్రీనివాస్ తెలిపారు. బస్టాండ్ సెంటర్‌ను కొంతమంది ఆక్రమించి పలు వ్యాపారాలు నిర్వహిస్తుండటం, వాహనాలు పెద్ద ఎత్తున నిలిపి ఉంచడంతో కనీసం ఆర్టీసీ బస్సు వచ్చి తిరిగి వెళ్లడానికి కూడా వీలు లేకుండా పోయిందన్నారు. దీనిపై గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించడంతోపాటు బస్టాండ్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలని కోరారు.

డ్రెయిన్లలో పూడిక తీత పనులు ప్రారంభం



గుడివాడరూరల్: మండలంలోని సిద్ధాంతం గ్రామంలోని పాలకోడు డ్రెయిన్‌లో పూడికతీత పనులను గురువారం చేపట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ రూ.3 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని డ్రెయిన్ల పూడిక తీత పనులు చేపట్టడం జరిగిందన్నారు. పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, డ్రెయినేజీ డీఈ గణపతి, ఏఈ కుమార్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

- చెత్త నుంచి సంపద కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిన వైనం



జమీదగ్గుమిల్లిలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం

పామర్రు: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. మండలంలోని 25 గ్రామాల్లో సుమారు రూ.1.35 కోట్ల స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో రోజూ గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించిన తడి, పొడి చెత్తను రిక్షాల ద్వారా ఈ కేంద్రాలకు తరలించాలి. అక్కడ తడి, పొడి చెత్తను వేరు వేరుగా కుండీల్లో వేసి వర్మీకంపోస్టు, సేంద్రీయ ఎరువు తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించాలి. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను స్క్రాప్ దుకాణాలకు విక్రయించి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నదే ఈ కేంద్రాల ఏర్పాటు వెనుకున్న లక్ష్యం. కానీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో లక్ష్యం నీరుగారుతోంది. మండలంలోని 25 కేంద్రాల్లో ప్రస్తుతం రెండు మూడు పంచాయతీల్లో మాత్రమే ఈ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగతా చోట అలంకారప్రాయంగా ఈ కేంద్రాలు మిగిలాయి. కొన్ని కేంద్రాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి. అధికారులు స్పందించి తక్షణమే చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే..

గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే అన్న చందాన ఉన్నది. రహదార్ల వెంబడి పరిసరాలు చెత్త చెదారాలతో నిండి ఉంటున్నాయి. దీనికితోడు రహదార్ల వెంబడి డ్రెయినేజీ వ్యవస్థలు సక్రమంగా లేని కారణంగా రోడ్లు అన్ని గోతులమయంగా వర్షపు నీటితో నిండి ఉంటున్నాయి. అధికారులు స్పందించి చెత్తసంపద కేంద్రాల ద్వారా సంపద సృష్టించే విధంగా చర్యలు తీసుకుని గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

> **వినియోగంలోకి తెస్తాం**
>
> మండలంలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిరుపయోగంగా ఉన్న వాటిని తక్షణమే వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. చెత్తసంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారు చేయించి, రైతులకు తక్కువ ధరకు విక్రయించేలా చూస్తాం.
>
> – జ్యోతి, ఎంపీడీవో, పామర్రు

అకాల వర్షాలతో అవస్థలు



తోట్లవల్లూరు కనకదుర్గమ్మ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

తోట్లవల్లూరు: అకాల వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా భారీగా వర్షం కురుస్తుండటంతో రోడ్లపై పెద్ద ఎత్తున నీరు నిలిచి అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరుతోపాటు పలు గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి వర్షం కుండపోతగా కురిసింది. దీంతో స్థానిక కనకదుర్గమ్మ కాలనీలో వర్షం నీరు రోడ్లపై నిలిచి, ఇళ్లకు ఎగదన్నింది. రోడ్ల వెంబడి ఉన్న డ్రెయిన్లు పూడుకుపోవడంతో వర్షం నీరు పోయే దారి లేకుండా పోయింది. వర్షం నీటికి తోడు చిత్తడిగా మారిన అంతర్గత రోడ్లపై రాకపోకలు సాగించలేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల చుట్టూ వర్షం నీరు ఉండటంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి డ్రెయిన్లలో పూడిక తీయించి మురుగునీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ



మండవల్లిలో గ్రంథాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఐక్య వేదిక సభ్యులు

మండవల్లి: జీవ వైవిధ్య పరిరక్షణతోనే భూమిపై మానవ మనుగడ సక్రమంగా సాగుతుందని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టీ అప్పారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక గ్రంథాలయం వద్ద మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ భూమిపై సమస్త జీవరాశులను రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఐక్య వేదిక సభ్యులు, ఝాన్సీ, కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పామర్రు: వైశాఖ మాసం బహుళ దశమిని పురస్కరించుకుని గురువారం వాడ వాడలా హనుమజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని జమీదగ్గుమిల్లి, రాపర్ల గ్రామాల్లో సీతారామాంజనేయస్వామి, వీరాంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలను చేశారు. స్వామివార్లకు పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను చేసి, స్వామిని శతసహస్ర నామాలతో పూజలు చేశారు. అలాగే స్థానిక ఉండ్రపూడి – పోలవరం అడ్డరోడ్డులోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష తమలపాకులతో పూజలు చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నసమారాధనను ప్రారంభించి భక్తులకు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వరప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని బుచ్చమ్మ తల్లి ఆశ్రమంలో ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



బుచ్చమ్మ ఆశ్రమంలో ఆంజనేయస్వామి

హనుమాన్ శోభాయాత్ర

పెదముత్తేవి(మొవ్వ): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం మొవ్వ మండలంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమం నుంచి ఈ శోభాయాత్ర బయలుదేరి మొవ్వ, కూచిపూడి, కారకంపాడు కొండవరం మీదుగా పెదముత్తేవి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా అయ్యంకి అడ్డరోడ్డు వద్ద గల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శోభాయాత్రకు మముక్షు జన మహాపీఠాధిపతి ముత్తేవిగౌర కృష్ణ గురూజీ నేతృత్వం వహించారు.

గ్రామ గ్రామాన వేడుకలు

పమిడిముక్కల: గ్రామ, గ్రామాన హనుమజ్జయంతిని నిర్వహించారు. గోపువానిపాలెం శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. మంటాడ, కపిలేశ్వరపురం, హనుమంతపురం అడ్డరోడ్డు, వీరంకిలాకు ఎన్టీఆర్ కాలనీ, కూడేరు, చోరగుడి తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలు చేశారు.

తోట్లవల్లూరు: మండలంలోని గరికపర్రు, యాకమూరు, భద్రిరాజుపాలెం, తోట్లవల్లూరుతోపాటు పలు గ్రామాల్లో హనుమజ్జయంతి సందర్భంగా అభయాంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, శాంతి కల్యాణాలు, తమలపాకు పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలు జరిగాయి. ఆయా ఆలయ కమిటీలు కార్యక్రమాలను పర్యవేక్షించాయి.

గుడివాడలో..

గుడివాడ టౌన్: హనుమాన్ జయంతి వేడుకలను పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారిని తమలపాకులు, పుష్పాలతో అలంకరించారు. స్థానిక నాగవరప్పాడులోని శ్రీదాసాంజనేయస్వామి దేవస్థానం, శ్రీగౌరీశంకరస్వామివారి దేవస్థాన ఉప ఆలయమైన శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, పెద ఎరికపాడులోని శ్రీఆంజనేయ స్వామివారి దేవస్థానం, వాసవీచౌక్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పఠించారు. అనంతరం అన్నసమారాధనలు చేశారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.



గోపువానిపాలెంలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



తోట్లవల్లూరులో స్వామివారు



గుడివాడలో అభయాంజనేయస్వామి

గుడ్లవల్లేరులో...

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలోని మామిడికోళ్లలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం హైదరాబాదు హైకోర్టు న్యాయవాది చిత్తర్వు రఘు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ చిత్తర్వు మధు కుటుంబీకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంగలూరులో భక్తులు హనుమాన్ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్‌వీఎస్‌వీపీ సత్యనారాయణ, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మెరుగుమాల బాలు పాల్గొన్నారు. వేమవరం శ్రీకొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి దత్తత దేవస్థానం రెడ్డిపాలెం అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, నాగవల్లి(తమలపాకులు) దళ సహిత సహస్ర నామార్చన, స్వామివారి శాంతి కల్యాణం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే గుడ్లవల్లేరు శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న ఆంజనేయస్వామికి పంచామృత స్నపన, నూతన వస్త్రాలంకరణ, తమలపాకుల సహస్రనామ పూజ, 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణ గీత భక్త సమాజం వారిచే నిర్వహించారు.

మండవల్లి: మండవల్లిలో గురువారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ జయంతి పురస్కరించుకుని స్థానిక సెంటర్‌లోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం నుంచి కైకలూరు మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వరకు ధర్మాచార్యుల మార్గదర్శనంలో బైక్ ర్యాలీ నిర్వహించినట్లు స్థానిక హనుమాన్ శోభాయాత్ర కమిటీ పేర్కొంది. హిందూ సంస్థలు, హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పెదముత్తేవిలో హనుమాన్ శోభాయాత్ర



మామిడికోళ్లలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయవాది రఘు



మండవల్లిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

హారతులందుకో.. హనుమా



ఆటపాకలో ఆంజనేయస్వామిని దర్శించుకున్న డీఎన్నార్

కైకలూరు: హారతులందుకో హనుమా.. అంటూ ఆంజనేయస్వామిని భక్తులు వేడుకున్నారు. నియోజకవర్గంలో హనుమద్ జయంతిని గురువారం నిర్వహించారు. ఆటపాక శివారు నాగాపురం, ఆటపాక గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కైకలూరు గాంధీబొమ్మ వద్ద పురాతన అభయాంజనేయ గుడి వద్ద అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సింగంశెట్టి రాము, ఆటపాక ఎంపీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి లక్ష్మి, నాయకులు పంజా రామారావు, కన్నా రమేష్, వల్లారపు సుబ్రహ్మణ్యం, బుర్ల కిరణ్, ఈతకోట శ్రీను, పిచ్చకల రాము, జక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండవల్లిలో హన్‌మాన్ బైక్ శోభాయాత్రను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ప్రజలు ఆదర్శవంతమైన భక్తి భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఆటపాక, వింజరం, కోరుకొల్లు, ముదినేపల్లి, మండవల్లిలలో జరిగిన హనుమద్ జయంతి కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. శోభాయాత్రలో హిందూ కుటుంబ సభ్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల నిమిత్తం శుక్ర, శనివారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, అలాగే మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బస్టాండ్ నిర్మాణ స్థలం పరిశీలన



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో బస్టాండ్ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని ఆర్టీసీ అధికారులు గురువారం పరిశీలించారు. గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పొట్లూరి రమేష్(బెంగళూరు) గత 25 ఏళ్ల క్రితం స్థానిక మెయిన్‌సెంటర్‌లో సుమారు 12 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి బస్టాండ్ నిర్మాణ నిమిత్తం ఉయ్యూరు ఆర్టీసీ డిపో అధికారులకు అప్పగించారు. బస్టాండ్ నిర్మాణం కోసం అప్పటి నుంచి ఆర్టీసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆయన నేరుగా సీఎం చంద్రబాబుకి స్థలం తిరిగి అప్పగించాలని లేఖ రాశారు. దీనిపై ఆర్టీసీ విజయవాడ జోన్–2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే విజయరత్నం, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వాణిశ్రీ, ఉయ్యూరు డిపో మేనేజర్ పెద్దిరాజు బస్టాండ్ స్థలాన్ని పరిశీలించారు. బస్టాండ్ నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంబంధిత ప్రదేశంలో పోలీసులు నిలిపి ఉంచిన లారీని తీసేయాలని ఎస్ఐ అవినాశ్‌ను కలిసి అధికారులు విజ్ఞప్తి చేశారు. డెప్యూటీ ఈఈ జగదీష్, ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



జమీగొల్వేపల్లి(పామర్రు): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ అధికారి వీ నాగసురేష్ పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పామర్రు గ్రంథాలయంలో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించామని గ్రంథాలయ అధికారి ఝాన్సీ రాణి తెలిపారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు డీఎన్నార్ పరామర్శ



చిగురుకోటలో కోమటి విష్ణువర్ధన్‌ను పరామర్శిస్తున్న డీఎన్నార్ తదితరులు

ముదినేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజ్‌ల సంఘం అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ తండ్రి రామకోటయ్య ముదినేపల్లి మండలం చిగురుకోటలో ఇటీవల మృతిచెందారు. కోమటి విష్ణువర్ధన్ ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. అదేవిధంగా మండవల్లి మండలం భైవరపట్నం గ్రామంలో గాదిరాజు భాస్కరవర్మ సతీమణి ఇటీవల మరణించడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి, ముదినేపల్లి మండలం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మొట్రు ఏసుబాబు, కైకలూరు, పార్టీ మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, బోయిన రామరాజు, నియోజకవర్గ వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు సాక్షి సాయి, నాయకులు రామారావు, దివి సతీష్, నీలం నాగరాజు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయ అభివృద్ధికి విరాళాల వెల్లువ



వెంకట్రావుకు విరాళాలు అందజేస్తున్న దాతలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివారి దేవాలయ అభివృద్ధి పనులకు గురువారం విరాళాలు వెల్లువెత్తాయి. దాతలు పొట్లూరి నరసింహారావు, లక్ష్మీబాయమ్మ కుటుంబ సభ్యులు రూ. 20,116, పొట్లూరి రామప్రసాద్ రూ. 10,116, జాస్తి ధనలక్ష్మి, విష్ణు రూ. 20,116, పొట్లూరి రాహుల్ చౌదరి రూ. 10,116, పొట్లూరి లక్ష్మీప్రసాద్ రూ. 10,116, పొట్లూరి రమాదేవి రూ. 10,116, సాయపనేని విజయలక్ష్మి, సందీప్ మెహర్ రూ. 20,116, పొట్లూరి చిరంజీవి రాజా రూ. 10,116ను గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందజేశారు. నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, సంత కమిటీ డైరెక్టర్లు పోలవరపు వెంకట్రావు, వల్లభనేని బుడ్డిబాబు, యెనిగెళ్ల నాగేశ్వరరావు, చాపరాల సుధాకర్, ఆలయ ధర్మకర్తలు కొప్పురావూరి రవి, మురాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంయూలను కొనసాగించాలి

గుడివాడ టౌన్: ప్రజా పంపిణీలో కీలకపాత్ర పోషిస్తున్న సంచార వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసే నిర్ణయం సీఐటీయూ, ఏఐటీయూసీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయని నాయకులు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం నాయకులు విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తూ వారికి ఇబ్బంది కలగకుండా ఈ వాహనాలు సరకులు అందజేస్తున్నాయని పేర్కొన్నారు. డీఎంయూలను కొనసాగించాలని సూచించారు. వీటిని రద్దు చేస్తే వేలాదిమంది యువత ఉపాధిని కోల్పోతారన్నారు. కూటమి ప్రభుత్వానికి ఇది తగదన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజాగ్రహానికి గురికావలసివస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లంక సురేంద్ర, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ జిల్లా కన్వీనర్ కే సురేష్, నాయకులు ఆర్ కొండ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పామర్రు: స్థానిక సాయినగర్‌లోని శ్రీషిర్డీ సాయి మందిరంలో గురువారం బాబావారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత బాబాకు ఆవుపాలతో అభిషేకాలు, నమక చమకాలతో స్నపన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల చేత బాబాకు విశేషంగా పూజలు చేయించారు. మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

దళితులను అవమానపరిచిన వారిపై కేసు నమోదు చేయాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రకాశం జిల్లా జరుగుమిల్లి మండలం కె బిట్రగుంటలో దళితులను అవమానపరిచిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులను నమోదు చేసి నిందితులను అరెస్టు చేయాలని దళిత బహుజన పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఎల్ఐసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు పి.శోభన్‌కుమార్, దళిత జేఏసీ కన్వీనర్ జక్కుల ఆనంద్‌బాబు, దళిత ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు మద్దాల వీరాస్వామి, డీబీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గోని గాంధీ పాల్గొన్నారు.